నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | బుధవారం 3 జనవరి 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

## దేవాపూర్‌లో బడి బయట పిల్లల గుర్తింపు సర్వే



పెద్దగూడ గ్రామంలో సర్వే చేస్తున్న దేవాపూర్ సీఆర్పీ మంతెన రమేశ్

కాసిపేట, జనవరి 2 : దేవాపూర్ స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని పెద్దగూడలో బడి బయట పిల్లల గుర్తింపు కోసం సర్వే నిర్వహించారు. దేవాపూర్ సీఆర్పీ మంతెన రమేశ్ ఆధ్వర్యంలో సర్వే చేసి ఇద్దరు డ్రాపౌట్ పిల్లలను గుర్తించి వివరాలు నమోదు చేశారు. పిల్లలను పాఠశాలకు పంపించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. సర్వేలో గుర్తించిన పిల్లలను ప్రబంధ్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసి.. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో వారి వయసుకు తగ్గ తరగతిలో చేర్పించడం జరుగుతుందని సీఆర్పీ మంతెన రమేశ్ తెలిపారు.

## ఎమ్మెల్సీ దండే విఠల్‌కు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, జనవరి 2 : జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసానికి వచ్చిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్‌కు ఎమ్మెల్యే కోవ లక్ష్మి, బీఆర్ఎస్ మహిళా నాయకురాలు మర్సుకోల సరస్వతి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అంతకుముందు నియోజకవర్గానికి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే కోవ లక్ష్మికి న్యూ ఇయర్ విషెస్ చెప్పారు. తెలంగాణ ఉద్యమ గాయకుడు ఇర్ఫాన్ ఉన్నారు.

ఎమ్మెల్సీ విఠల్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి, బీఆర్ఎస్ మహిళా నాయకురాలు సరస్వతి



## బంకుల్లో బారులు



పెట్రోలు బంకుల వద్ద పెద్ద క్యూలో వాహనాలు

మంచిర్యాల అర్బన్, జనవరి 2 : పెట్రోలు, డీజిల్ లారీ ట్యాంకర్ల డ్రైవర్లు సమ్మెలోకి వెళ్లగా.. మంగళవారం వాహనదారులు బంకుల వద్ద బారులు తీరారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఏ బంకు వద్ద చూసినా వాహనాల రద్దీ కనిపించింది. ట్రాక్టర్లు, లారీలు, స్కూలు బస్సులు, ద్విచక్ర వాహనాలు పెద్ద సంఖ్యలో చేరుకోవడంతో ఆయాచోట్ల ట్రాఫిక్ జామ్ అయ్యింది. కొందరు ద్విచక్ర వాహనదారులు బాటిళ్లలో పెట్రోలు పోయించుకుంటుండగా, మిగతా వారు గొడవకు దిగడంతో బాటిళ్లలో పెట్రోలు పోయడం నిలిపివేశారు. కొన్ని బంకుల్లో నో స్టాక్ బోర్డులు పెట్టారు. ఇక మిగితా బంకుల్లో ఇంధనం అయిపోతే పరిస్థితి ఏమిటని ఆందోళన చెందుతుండగా, సాయంత్రం సమ్మె విరమించినట్లు ట్యాంకర్ల డ్రైవర్లు ప్రకటించడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. సేల్స్ మేనేజర్లు స్వయంగా వచ్చి రాత్రి వరకు ఫ్యూయల్ వస్తుందని చెప్పినా వాహనదారులు వినకపోవడం గమనార్హం.



పెట్రోలు బంకు వద్ద నో స్టాక్ బోర్డు పెట్టిన యాజమాన్యం

## మేకల మందపై చిరుత దాడి

కోటపల్లి, జనవరి 2 : మండలంలోని పిన్నారం అటవీ ప్రాంతంలో మేకల మందపై మంగళవారం చిరుతపులి దాడి చేసింది. గడ్డం అంకయ్య తన మేకలు తోలుకొని అడవికి వెళ్లగా.. ఒక్కసారిగా చిరుత దాడి చేసింది. అంకయ్య కేకలు వేయడంతో నోట పట్టుకున్న మేకను వదిలేసి అడవిలోకి పరిగెత్తింది. మేకకు తీవ్ర గాయాలయ్యాయి. సోమవారం కోటపల్లిలో సంచరించిన చిరుత మంగళవారం పిన్నారం సమీపంలో కనిపించగా స్థానికులు భయపడుతున్నారు.

# దళితబంధుపై నీలినీడలు


### కేసీఆర్ సర్కారు హయాంలో నిధులు విడుదల

- రెండో విడుతకు ఇచ్చిన రూ.29 కోట్లు వెనక్కేనా?
- పంపిణీపై స్పష్టత ఇవ్వని కాంగ్రెస్ సర్కారు
- దళిత కుటుంబాల్లో అయోమయం
- కొనసాగించాలని దళిత సంఘాల డిమాండ్..

నిర్మల్, జనవరి 2(నమస్తే తెలంగాణ) : దళితుల కుటుంబాల్లో వెలుగులు నింపిన 'దళితబంధు' పథకంపై నీలినీడలు కమ్ముకున్నాయి. కేసీఆర్ ప్రభుత్వం అర్హులైన ఒక్కో దళిత కుటుంబానికి రూ.10లక్షల చొప్పున ఆర్థిక సహాయాన్ని అందజేసింది. కేసీఆర్ ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయవద్దని ఎస్సీ కార్పొరేషన్ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు అందినట్లు విశ్వసనీయ సమాచారం. దీంతో దళితబంధు పథకాన్ని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తుందా? లేదా? అనే దానిపై నీలినీడలు కమ్ముకున్నాయి. కాగా.. పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేస్తున్నదనే ప్రచారం జోరుగా సాగుతుండడంతో రెండో విడుత కింద ఎంపికైన లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. కొనసాగించాలని డిమాండ్లు వస్తున్నప్పటికీ, పథకం కొనసాగింపుపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటన చేయలేదు.

### రెండో విడుతలో మంజూరైన నిధులు వెనక్కేనా..!

మొదటి విడుతలో ఎంపికైన లబ్ధిదారులు తమకు నచ్చిన యూనిట్లను తీసుకొని వ్యాపారాలు చేసుకుంటూ ఆర్థికంగా నిలదొక్కుకున్నారు. రెండో విడుత ప్రక్రియను ప్రారంభించిన సమయంలోనే ఎన్నికల షెడ్యూల్ రావడంతో పంపిణీ ప్రక్రియ నిలిచింది. నిర్మల్ జిల్లావ్యాప్తంగా రెండో విడుత కింద 198 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. మూడు దశల్లో ఆర్థిక సాయాన్ని అందజేయాలని కేసీఆర్ ప్రభుత్వం భావించింది. ఇందులో భాగంగా మొదటి దశలో ఒక్కో లబ్ధిదారుని బ్యాంకు ఖాతాలో రూ.3 లక్షల చొప్పున జమ చేసేందుకు రూ.29.16 కోట్లు విడుదల చేసింది. ఇదే సమయంలో ఎన్నికల కోడ్ రావడంతో లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులు వేసే ప్రక్రియ ఆగింది. కాగా.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం దళితబంధు పథకాన్ని అమలు చేసేందుకు సానుకూలంగా లేదనే ఊహాగానాలు ఉన్నాయి. దీంతో విడుదలైన రూ.29.16 కోట్ల వినియోగంపై అధికారులకు స్పష్టత లేకుండా పోయింది.




కడెం మండలం నర్సాపూర్‌లో లబ్ధిదారులకు జేసీబీని అందజేస్తున్న అధికారులు (ఫైల్)

### తొలి విడుతలో 261 మందికి..

కేసీఆర్ ప్రభుత్వం దళితబంధు పథకాన్ని ప్రవేశపెట్టిన తర్వాత మొదటి విడుతలో నియోజకవర్గానికి 100 మంది చొప్పున.. నిర్మల్ జిల్లావ్యాప్తంగా 261 మంది లబ్ధిదారులకు పథకాన్ని వర్తింపజేసింది. లబ్ధిదారులు హార్వెస్టర్లు, జేసీబీ యంత్రాలు, ఫర్టిలైజర్, కిరాణ, ఫొటోగ్రఫీ దుకాణాలు, ఆయిల్ మిల్, టెంట్ హౌస్, డెయిరీ ఫాం, గొర్రెల యూనిట్లు తీసుకున్నారు. ఒకవేళ లబ్ధిదారులు వ్యాపారాల్లో నష్టపోతే.. వారికి ఆర్థికంగా ఉండేందుకు రూ.52.20 లక్షల రక్షణ నిధిని అధికారులు జమ చేశారు.

### కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయం తీసుకోలేదు..



*కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రెండో విడుత దళితబంధు పథకాన్ని వర్తింప జేసేందుకు నిర్మల్ జిల్లా వ్యాప్తంగా 198 మంది లబ్ధిదారులను ఎంపిక చేశాం. వీరికి మొదటి దశలో కింద రూ.29.16 కోట్లను విడుదల చేసింది. ఇంతలోనే ఎన్నికల షెడ్యూల్ రావడంతో పథకాన్ని నిలిపివేశాం. దళితబంధు కొనసాగింపుపై కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ముందుకు వెళ్తాం.*

**- హన్మాండ్లు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ, నిర్మల్.**

### కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో..

కుమ్రం భీం ఆసిఫాబాద్, జనవరి 2 (నమస్తే తెలంగాణ): కేసీఆర్ సర్కారు దళితబంధు పథకంలో భాగంగా జిల్లాలోని సిర్పూర్, ఆసిఫాబాద్ నియోకవర్గాల్లో 200 మందిని ఎంపిక చేసి ఒక్కొక్కరికీ రూ. 10 లక్షల చొప్పున మంజూరు చేసింది. లబ్ధిదారులు తమకిష్టమైన వ్యాపారం చేసుకుంటూ ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారు. ఇక మరో విడుతలో నియోజకవర్గానికి 500 మందికి చొప్పున సాయమందించేందుకు అర్జీలను స్వీకరించింది. రెండు నియోజకవర్గాల నుంచి 1000 మందిని ఎంపిక చేసే క్రమంలో అసెంబ్లీ ఎన్నికల కోడ్ రావడంతో ప్రక్రియ నిలిచిపోయింది. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగా, ఈ పథకం అమలవుతుందా.. లేదా అన్న సందేహాలు కలుగుతున్నాయి. ఈ పథకం కొనసాగింపుపై స్పష్టత ఇవ్వాలని దళితులు కోరుతున్నారు.

## న్యూ ఇయర్ విషెస్



కలెక్టర్ సంతోష్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న కలెక్టరేట్ సిబ్బంది

మంచిర్యాల అర్బన్, జనవరి 2 : కలెక్టరేట్‌లో కలెక్టర్ బదావత్ సంతోష్, అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్, ఎమ్మెల్యే గృహంలో ప్రేమ్‌సాగర్‌రావుకు ఆయా శాఖల అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది, వసతి గృహ సంక్షేమ అధికారుల సంఘం నాయకులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

## భీమ దేవర జెండా పండుగను ఘనంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న ఆదివాసీ కోలవార్ సేవా సంఘం నాయకులు

కోటపల్లి, జనవరి 2 : ఈ నెల 8న ప్రతి గిరిజన గూడెంలో భీమ దేవర జెండా పండుగను ఘనంగా నిర్వహించుకోవాలని ఆదివాసీ కోలవార్ సేవా సంఘం మండల అధ్యక్షుడు ఆత్రం మధూకర్, మండల ప్రధాన కార్యదర్శి బండి రమేశ్, ఉపాధ్యక్షుడు ఈగం లక్ష్మణ్ పిలుపునిచ్చారు. మంగళవారం కోటపల్లి మండల కేంద్రంలో వారు మాట్లాడారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గిరిజన సంస్కృతీ సంప్రదాయాలు ఉట్టి పడేలా నిర్వహించుకోవాలని సూచించారు. ఆదివాసీ కోలవార్లకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడంతో పాటు వారి సమస్యలు పరిష్కరించాలని కోరారు.

## ఇబ్బంది కలుగకుండా చూడాలి..

ఇచ్చోడ, జనవరి 2 : ప్రజాపాలనలో వచ్చే దరఖాస్తుదారులకు ఇబ్బంది కలుగకుండా చూడాలని అధికారులను బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం ఇచ్చోడ మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌లో నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభను సందర్శించారు. ఎంపీడీవో రాంప్రసాద్, తహసీల్దార్ తుకారాం పాల్గొన్నారు.

# మిశ్రమ సేద్యంపై మక్కువ

### కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా రైతుల వినూత్న సాగు

- సంప్రదాయ పంటలు తగ్గిస్తూ.. కొత్త వాటిపై ఆసక్తి
- ప్రధానంగా నూనె గింజలు వేసేందుకు మొగ్గు
- వెయ్యి ఎకరాల్లో ఆయిల్‌పాంకు ప్రణాళికలు



మిశ్రమ పద్ధతుల్లో పంటలు సాగుచేస్తున్న రైతులు

కుమ్రం భీం ఆసిఫాబాద్, జనవరి 2 (నమస్తే తెలంగాణ) : జిల్లా రైతులు మిశ్రమ సాగుపై మక్కువ చూపుతున్నారు. తమకున్న కొద్దిపాటి భూమిలో రకరకాల పంటలు వేస్తూ లాభాల బాట పడుతున్నారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా.. మార్కెట్‌లో ఉన్న డిమాండ్‌ను బట్టి ప్రధానంగా నూనె గింజల సాగుపై ఆసక్తి చూపుతున్నారు. సంప్రదాయ పంటలైన పత్తి, వరి, కందికి బదులుగా వేరుశనగ, పొద్దు తిరుగుడు, నువ్వులు, కుసుమవంటి వాటివైపు మొగ్గు చూపుతున్నారు. యేటా ఒకేరకమైనవి వేసి నష్టపోయే బదులు.. వినూత్నమైన పంటలు వేస్తూ ఆదాయం పొందుతున్నారు.

### యేటేటా పెరుగుతున్న నూనె గింజల సాగు..

జిల్లాలో నూనె గింజల సాగు యేటేటా పెరుగుతున్నది. ఈ రెండుమూడేళ్లలో వేరుశనగ, నువ్వులు, పొద్దుతిరుగుడు, కుసుమ, ఆముదం సాగు నాలుగు నుంచి ఆరు రెట్లు పెరిగింది. జిల్లాలో ఈ నాలుగేళ్లలో వేరు శనగ సాగు 57 ఎకరాల నుంచి 450 ఎకరాలకు పెరగడం విశేషం. అదేవిధంగా నువ్వులు, ఆముదం సాగు కూడా యేటా యాసంగిలో పెరుగుతూ వస్తున్నది. జిల్లాలో పొద్దు తిరుగుడు సాగు కూడా గణనీయంగా పెరుగుతోంది. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా పంటల సాగులో మార్పులు రావడం శుభ పరిణామమని అధికారులు అంటున్నారు. కాగా, వరి సాగు క్రమంగా తగ్గుతూ వస్తున్నది. జిల్లాలో ఈ యేడాది 4 వేల నుంచి 5 వేల ఎకరాల్లో తగ్గింది.

### వెయ్యి ఎకరాల్లో ఆయిల్ పాం..

జిల్లాలో కొత్తగా వెయ్యి ఎకరాల్లో ఆయిల్ పాం సాగు పెంచేందుకు అధికారులు ప్రణాళికలు అమలు చేస్తున్నారు. ఇప్పటికే దాదాపు వెయ్యి మంది రైతులకు ఆయిల్ పాం సాగు విధానాలపై శిక్షణ కూడా ఇచ్చారు. క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు రైతులను సాగు చేస్తున్న ప్రాంతాలకు తీసుకెళ్లారు.

| పంటలు | 2019 | 2020 | 2021 | 2022 | 2023 |
|---|---|---|---|---|---|
| వేరుశనగ | 57 | 60 | 258 | 356 | 450 |
| నువ్వులు | 26 | 49 | 51 | 140 | 180 |
| పొద్దుతిరుగుడు | 18 | 50 | 70 | 170 | 175 |
| కుసుమ | - | 127 | 130 | - | - |
| ఆముదం | 163 | 85 | 180 | 200 | 264 |
| సోయాబీన్ | 4801 | 1753 | 1850 | 1754 | 2250 |

## గ్యారెంటీ పథకాల కోసం దరఖాస్తులివ్వాలి

- ఆసిఫాబాద్ కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు
- రోళ్లపహాడ్‌లో ప్రజాపాలన



ప్రజాపాలన గ్రామసభలో పాల్గొన్న కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు

రెబ్బెన, జనవరి 2 : అభయహస్తం గ్యారెంటీ పథకాల కోసం దరఖాస్తులివ్వాలని, అప్పుడే పథకాలు అందుతాయని కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు పేర్కొన్నారు. మంగళవారం రోళ్లపహాడ్ గ్రామ పంచాయతీలో నిర్వహించిన ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణకు హాజరై మాట్లాడారు. ఈ నెల 6వ తేదీలోగా గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కౌంటర్‌లో దరఖాస్తులు అందించాలన్నారు. దరఖాస్తు ఫారానికి ఫొటో అంటించి ఆధార్, రేషన్ కార్డు జత చేస్తే సరిపోతుందన్నారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి దరఖాస్తును స్వీకరించి రసీదు అందించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ ప్రభాకర్, ఎంపీడీవో పరికిపండ్ల శ్రీనివాస్, తహసీల్దార్ సమీర్, డిప్యూటీ తహసీల్దార్ వరలక్ష్మి, ఏవో మంజుల, ఎంపీవో అంజాద్‌పాషా, ఏపీఎం రాజ్‌కుమార్, ఏపీవో బుచ్చన్న, ఏఈ ఇమ్రాన్, ఎంపీటీసీలు సంగం శ్రీనివాస్, దుర్గం రాము, సర్పంచ్‌లు పేర పోశయ్య, దాగం జమున, మంజిలి హన్మక్క, ఇన్‌చార్జి సర్పంచ్ మహేందర్, ఉపసర్పంచ్ కొడిపె వెంకటేశ్ ఉన్నారు.

# అర్హులందరికీ పథకాలు

- మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్
- గుడిపేట, నంనూర్‌లలో ఎమ్మెల్యేతో కలిసి దరఖాస్తుల స్వీకరణ



ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్, ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావు

హాజీపూర్, జనవరి 2 : అర్హులందరికీ పథకాలు అమలు చేస్తామని మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని గుడిపేట, నంనూర్ గ్రామాల్లో ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావుతో కలిసి దరఖాస్తులు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆరు గ్యారంటీల కోసం అర్హులైన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చుతామన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో నరేందర్, హాజీపూర్ తహసీల్దార్ సతీశ్‌కుమార్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు లగిశెట్టి లక్ష్మి, పద్మ, ఎంపీటీసీ ఒడ్డె బాలరాజు, మాజీ జడ్పీటీసీ పుస్కూరి శిల్ప, ప్రజలు పాల్గొన్నారు.

## జిల్లా అభివృద్ధికి కలిసికట్టుగా కృషి చేద్దాం

- ఆసిఫాబాద్ కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు



కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ హేమంత్ బోర్కడే సహదేవరావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న అధికారులు

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, జనవరి 2 : జిల్లా అభివృద్ధికి కలిసికట్టుగా కృషి చేద్దామని కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపేందుకు వచ్చిన అధికారులతో ఆయన మాట్లాడారు. జిల్లా యంత్రాంగం అంకితభావంతో పనిచేసి జిల్లాను ప్రగతి పథంలో నడిపించాలని కోరారు. అంతకుముందు అదనపు కలెక్టర్ దీపక్ తివారీ కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందించి న్యూ ఇయర్ విషెస్ చెప్పారు. ఆర్డీవో కదం సురేశ్, ఏడీ సోమేశ్వర్, డీఎస్‌వో తారామణి, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, ఆసిఫాబాద్ సబ్ జైలర్ ప్రేమ్‌కుమార్, వసతి గృహాల సంక్షేమాధికారులు, టీఎన్‌జీవోస్ అధ్యక్ష, కార్యదర్శులు, అధికారులు పాల్గొని ఒకరికొకరు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

## ఆదివాసుల జీవన శైలిపై అధ్యయనం

బెజ్జూర్, జనవరి 2 : ఆదివాసుల జీవన శైలిపై అధ్యయనం చేసేందుకు చెన్నైలోని సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన విద్యార్థిని దుర్గం పూజిత మంగళవారం మండలంలోని అంబాగట్ గ్రామంలో పర్యటించారు. గిరిజనులను కలిసి, వారి వివరాలు సేకరించారు. దహెగాం మండలంలోని పెసరగుంట గ్రామానికి చెందిన పూజిత, సెంట్రల్ యూనివర్సిటీలో ఎమ్మెస్సీ జియోగ్రఫీ చేస్తున్నారు. ఆదివాసుల జీవనశైలి, సంస్కృతి.. సంప్రదాయాలు, ప్రభుత్వం నుంచి పొందుతున్న పథకాలపై అవగాహన, చదువు, వైద్య సదుపాయాలు, నాటు వైద్యం పద్ధతులు తదితర విషయాలపై వివరాలు సేకరించారు. వీరి జీవనశైలిపై పూర్తిస్థాయిలో అధ్యయనం చేస్తున్నట్లు పేర్కొన్నారు. వివాహాలపై గిరిజనుల ప్రత్యేక సంప్రదాయాలు నేటికీ కొనసాగిస్తున్నారా.., గతంలో అటవీ ఉత్పత్తులతో ఎలా గడిపారు.., వాటిని కొనసాగిస్తున్నారా.., వారి ఆరోగ్య పరిస్థితులెలా ఉంటున్నాయి.. అన్న విషయాలను నోట్ చేసుకున్నారు. దీనిపై స్పందించిన స్థానికులు పూర్వీకుల నుంచి వస్తున్న ఆచారాల వ్యవహారాలను తెలియజేశారు.



అంబాగట్‌లో వివరాలను సేకరిస్తున్న సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థిని పూజిత

## సింగరేణి సీఎండీ బలరామ్‌కు అభినందనలు



సీఎండీ బలరామ్‌ను అభినందిస్తున్న గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు

శ్రీరాంపూర్, జనవరి 2 : సింగరేణి సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్(సీఅండ్ఎండీ)గా మంగళవారం అదనపు బాధ్యతలు చేపట్టిన డైరెక్టర్ (ఫైనాన్స్, పా) ఎన్ బలరామ్‌ను సింగరేణి గుర్తింపు సంఘం, ప్రాతినిధ్య, కార్మిక సంఘాల నాయకులు అభినందించారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఆయన కార్యాలయంలో ఏఐటీయూసీ అధ్యక్షుడు వీ సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి మిర్యాల రంగయ్య, కే వీరభద్రయ్య, వైవీ రావు, ముస్కె సమ్మయ్య, ఎల్లయ్య కలిసి పుష్పగుచ్ఛాలు అందించి సన్మానించారు. ఇక టీబీజీకేఎస్ ఏరియా చర్చల ప్రతినిధి పెట్టం లక్ష్మణ్, బ్రాంచ్ కార్యదర్శి పానగంటి సత్తయ్య, ఆర్గనైజింగ్ కార్యదర్శి తొంగల రమేశ్, రత్నాకర్‌రెడ్డి, నరేశ్, రవించందర్, గోప్యానాయక్, లాలా, గొర్ల సంతోష్, పొగాకు రమేశ్, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్ సీఎండీగా బలరామ్‌ను నియమించడంపై హర్షం వ్యక్తం చేశారు.